


టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



నాన్నబొమ్మ(సంపాదకుడు)

రవీంద్రనాథ టాగోర్

రచన : రవీంద్రనాథ్ ఠాగూర్ , సంపాదక్ (బెంగాలీ,1893)The Editor



నా భార్య జీవించి ఉన్నపుడు, మా అమ్మాయి ప్రభని అంతగా పట్టించుకోలేదు. వాస్తవానికి, ప్రభ తల్లిని గురించి ఆలోచించినంతగా ప్రభ గురించి ఏనాడు నేను ఆలోచించలేదు.

అప్పట్లో నాదంతా అంటీముట్టని వ్యవహారమే. ప్రభ వెన్నుతట్టడం, వచ్చీరాని ముద్దు మాటలు వినడం, ఎప్పుడైనా ప్రభ నవ్వుతూనో ఆడుకొంటూనో ఉంటే దూరం నుంచి చూడడం. అంతే!

నాకు బుద్ధిపుట్టినంతసేపు బుజ్జగించి, నాకు ఏ మాత్రం అలసట కలిగినా ప్రభను ఆమె తల్లికి అప్పజెప్పడానికి సిద్ధంగా ఉండేవాడిని.

నా భార్య, ప్రభ తల్లి, ఊహించని విధంగా కాలంలో కనుమరుగయ్యింది. అలా మా ముక్కుపచ్చలారని పసిబిడ్డ తల్లి చేతుల్లోనుంచి నాన్న చేతుల్లోకి వచ్చింది. నేను అమాంతంగా గుండెల్లోకి పొదువుకొన్నాను.

అయితే, ఒకటి మాత్రం వాస్తవం. 'తల్లిలేని బిడ్డ పెంపకం నా బాధ్యత' అని ఆమెను నేను పెంచి పెద్ద చేస్తున్నానా, లేక 'భార్యలేని భర్తని కళ్లల్లో పెట్టుకొని చూసుకునే బాధ్యత'ను నా కూతురు తీసుకుందా అన్నది తేల్చిచెప్పడం కష్టం.

ఎలాగయితేనేం, ఆరేళ్ల వయస్సు నుంచే ప్రభ ఇంటి బాధ్యతలన్నీ తన భుజానికెత్తుకొంది. తన తండ్రికి ఏకైక సంరక్షకురాలిగా వ్యవహరించడం స్పష్టంగానే కనబడుతుంది.

నేను లోలోపలే నవ్వుకొన్నా, ఆమెకు విధేయుడినై నా సర్వం చిన్నారి ప్రభకు అప్పగించేసాను. త్వరలోనే ఓ విషయం గ్రహించాను. నేనెంత బలహీనుడిగా, నిస్సహాయుడిగా ఉంటే ప్రభ అంత ఎక్కువగా సంతోషించేది.

నా బట్టలను నేను చిలక్కొయ్యకు తగిలించబోయినా, నా గొడుగు నేను తెచ్చుకోబోయినా, ఆమె హక్కునేదో లాక్కున్నట్టుగా గంటుమొహం పెట్టుకొనేది. అంతకు మునుపెన్నడూ ఇంత చక్కని నాన్నబొమ్మ ఆమెకి అందుబాటులో లేదు!

దొరికింది చాలన్నట్టుగా, ఈ నాన్నబొమ్మకి భోజనం వడ్డించడం, అలంకరించడం, నిద్రపుచ్చడం అన్నీ పరమసంతోషంగా చేస్తోంది.



ఏ లెక్కల పాఠం చెప్పేటప్పుడో, బాలశిక్ష నేర్పేటప్పుడో తప్పించి, తండ్రి పెత్తనం ఎక్కడా చెల్లడం లేదు.

అప్పుడప్పుడు ఒక ఆలోచన వచ్చి వేధించేది. 'ప్రభకు యోగ్యుడైన వరుడిని వెతకడానికి వరకట్నం ఎలా సమకూర్చుకోగలను?' అని.

నేను ఆమెకు మంచి చదువు నేర్పుతున్నాను. ఏ చదువురాని మూర్ఖుని చేతిలోనో పెట్టవలసి వస్తే ఎలా?

ఆపై, సంపాదనపై దృష్టి పెట్టాలని నిశ్చయించుకొన్నాను. ప్రభుత్వ ఉద్యోగానికి వయోపరిమితి దాటిపోయాను. ప్రయివేటు ఉద్యోగం వేయించుకొనే పరపతి లేదు. బాగా ఆలోచించాక, పుస్తకాలు రాయాలని నిర్ణయించుకొన్నాను.

వెదురు బొంగులో రంధ్రాలు చేసాక, అది నూనెనో నీటినో నిలవచేయలేదు. వాస్తవానికి, దాని గ్రహణశక్తిని కోల్పోతుంది. అయితే, ఆ రంధ్రాలు చేసిన వెదురు బొంగులో నుంచి గాలిని ఊదితే, పైసా ఖర్చు లేకుండా సంగీతాన్ని పుట్టించవచ్చు. నా ఉద్దేశం ప్రకారం పని లేని మనిషి అలంకారప్రాయుడు. ఏ రంగంలోనూ రాణించలేని వారు, కనీసం సాహిత్యమైనా సృష్టించవచ్చు. ఆ ఆలోచనా స్ఫూర్తితోనే ఒక ప్రహసనం రాశాను. అది వేదిక మీద ప్రదర్శించబడింది కూడా. చూసిన వారందరూ ఎంతో బావుందన్నారు.

ఒకసారి ఆ కీర్తిని రుచి చూశాక, ఆ రంగంలో మరింత కృషి చేయకుండా ఉండలేకపోతున్నాను. రోజుల తరబడి ఒకదాని తరువాత ఒక ప్రహసనం రాస్తూనే ఉన్నాను.

ప్రభ వచ్చి చిరునవ్వుతో గుర్తు చేసేది.

"నాన్నా, స్నానానికి వేళయింది!"

"వెళ్లెళ్ళు! నేనెంత పనిలో ఉన్నానో కనబడడం లేదా? నన్ను విసిగించవద్దు!"

పాపమా పసిబిడ్డ ముఖం ఆకస్మాత్తుగా ఆర్పేసిన దీపంలా నల్లగా మాడిపోయేది. అంతేకాదు, పని మనుషులను తరిమి కొట్టాను. జీతగాళ్లను వంగదీసి బాదాను. వీధిలోని బిచ్చగాళ్లను కర్రదీసుకొని వెంబడించి మరీ తరిమికొట్టాను.

నా గది వీధివైపు ఉండడంతో ఎవరో దానయ్యలు చిరునామాలు ఆరా తీస్తూ దారడిగేవారు. నేరుగా వల్లకాటికి పొమ్మని కసిరికొట్టేవాడిని!

నేను ఒక బ్రహ్మాండమైన ప్రహసనం రాస్తున్నానని ఎవరూ గ్రహించరే!

అయితే, ఈ రాతకోతల వలన నాకు వినోదం, కీర్తి వచ్చినంతగా ఏనాడు ఆదాయం రాలేదు. అది నన్నేమీ ఇబ్బంది పెట్టలేదు. కానీ, నాకు అల్లుడు కాతగిన వరులందరూ ప్రహసనాలు రాయని తండ్రుల కోసం ఎదిగిపోయారు!

ఇంతలో ఒక అద్భుతమైన అవకాశం వచ్చింది. జవహర్ గ్రాంకు చెందిన ఓ భూస్వామి ఒక పత్రిక మొదలు పెట్టాడు. నన్ను సంపాదకుడిగా ఉండమని ఆహ్వానించాడు. నేను అంగీకరించాను.

మొదట్లో కొన్ని రోజులు చాలా దుడుకుగా, ఉద్వేగభరితంగా రాసేవాడిని. వీధిలోకి అడుగుపెట్టగానే మనుషులు నన్ను సంపాదకుడిగా గుర్తించే వారు. నా తల చుట్టూ ఓ కనబడని కాంతి వలయం ఉన్నట్టుగా భావించుకోసాగాను.

జహిర్ గ్రాం పొరుగూరు అహిర్ గ్రాం.

ఆ రెండు ఊళ్ల భూస్వాముల మధ్య చిరకాల వైరం. ఇరువురి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది.

ఒకప్పుడు ముష్టిఘాతాలు కురిపించని రోజులు ఉండేవి కావు. అయితే, ఇప్పుడు మెజిస్ట్రేట్ శాంతి భద్రతలు కాపాడమని ఇద్దరికీ గట్టి సూచనలు చేశాడు.

ఆ విధంగా, ఒకప్పటి ముఠారౌడీల స్థానాన్ని మేము భర్తీ చేశామన్న మాట!

నా స్థానానికి తగ్గ గౌరవంతో నేను ప్రవర్తిస్తున్నానని ప్రతి ఒక్కరు ప్రశంసించేవారు.

నా రచనలు ఎంత ఘాటుగా, తీవ్రంగా ఉండేవంటే అహిర్ గ్రాం వాసులు తమ తలెత్తుకొని నడవలేకపోతున్నారు. వారి తరతరాల వారసత్వ కుటుంబ చరిత్రలను నా సిరా నల్లబరిచేస్తోంది.

ఆ కాలమంతా, నా పనికి నేనే మురిసిపోతూ ఉండేవాడిని. ఆ ఆనందంతో తబ్బిబ్బవుతూ నేను వళ్లు చేశాను కూడా. విజేత అయిన మేధావిలా నా ఉబ్బిపోయిన ముఖం వెలిగిపోతుండేది.

నా వ్యంగ్యరచనా చాతుర్యానికి, సూటిపోటి మాటలతో అపహాస్యపు వాక్యాలతో ఎదుటివారిని బాధించగల నేర్పుకి నన్ను నేనే మెచ్చుకొనే వాడిని. అహిర్ గ్రాం వాసులపై నేను వేసే, సూదుల్లా చురుక్కున పొడిచే వాడి చెణుకులకి జహిర్ గ్రాం ఊరూరంతా మిగల పండిన పుచ్చకాయలాగా పగలబడి నవ్వేది.

చివరికి అహిర్ గ్రాం ఒక పత్రికని మొదలుపెట్టింది. వాటిలోని రచనలు ఎటువంటి సాహితీ సున్నితత్వం లేకుండా, మూర్ఖంగా, మొరటుగా, దిగంబరంగా ఉండేవి. దాని పరిణామం ఏమిటో ఇరుగ్రామాల వారు త్వరలోనే గ్రహించారు.

అయితే, నా వ్యంగ్య రచనాశైలి సాహితీమర్యాద స్పృహలో చిక్కుకుపోయింది. రానురాను, ఆ శైలిలోని ఎత్తిపొడుపు వాక్యాలలో దాగిన నర్మోక్తి పాఠకులపై ఎలాంటి ప్రభావం చూపలేకపోతోంది. మునుపటిలా మిత్రులైనా శత్రువులైనా పాఠకులను ఆకర్షించలేకపోతోంది.

ఫలితంగా, ఈ ఎత్తిపొడుపు రచనాయుద్ధంలో నేను విజేతనైనా, నా పాఠకులు గ్రహించలేకపోతున్నారు.

అది గ్రహించిన నేను, ఉత్తమ సాహిత్యాభిరుచి గురించి ఒక ఉపదేశవ్యాసం రాశాను. అంతలోనే, నేను చేయకూడని తప్పు చేశానని గ్రహించాను.

గంభీర విషయాలను హేళనచేసినంతగా, నిజంగా ఎగతాళి చేయాల్సిన వాటిని చేయరు. దానితో, సాటివారిలో సాహితీ నైతికోద్ధరణ చేయాలని పూనుకొన్న నా అమాయక ప్రయత్నం అనుకొన్నదానికి వ్యతిరేకంగా పూర్తిగా బెడిసికొట్టింది. పై నుంచి, మా పత్రికాధిపతి మునుపటిలా ఆదరణ చూపడం తగ్గించాడు.

ఇన్నాళ్లు ఒక సంపాదకుడిలా నాకు దక్కిన అపారగౌరవం సంఖ్యాపరంగా తగ్గుతోంది. స్వభావపరంగా తేలిపోతుంది. వీధుల్లో నడుస్తోంటే, నా రచనలలో గుర్తుంచుకున్న పదాలతో నన్ను ఎవరు పలకరించడం లేదు.

నాతో అతి నువ్వుగా ప్రవర్తించడం మొదలు పెట్టారు. అంటే, పకపక నవ్వుతూ నా భుజాన తట్టడం, ఏవో పేర్లు పెట్టి నన్ను ఆటపట్టించడం మొదలు పెట్టారు.

ఇదలా సాగుతుండగా, నన్ను కీర్తిమంతుణ్ణి చేసిన నా అభిమాన పాఠకులు నా ప్రహసనాలను మరిచిపోసాగారు. నాకై నేను, చివరికంటా మండి గీసేసిన అగ్గిపుల్లలా భావించుకోసాగాను. నా మనసు ఎంతో కుంగిపోయింది. నా బుర్రను ఎంతగా మథించినా ఒక్క వాక్యం కూడా రాయలేకపోతున్నాను. జీవితం మీద ఆశ పోయింది.

ఇప్పుడు ప్రభ నన్ను పలకరించడానికి జంకుతోంది. పిలిస్తే గానీ నా దగ్గరకు రావడం లేదు. మామూలు ఆటబొమ్మ లాంటి నాన్న ఆమెకు సన్నిహితుడు కానీ, ఈ ఘాటైన విమర్శాత్మక వ్యంగ్యరచనలు చేసే మేధావి తండ్రి కాడు.

ఒకరోజు అహిర్ గ్రాం పత్రిక, నా యజమానిని వదిలేసి నా మీద విరుచుకుపడింది. నా గురించి కొన్ని వికృత ఆరోపణలు చేసింది. నా స్నేహితులు, పరిచితులు ఒకరి తరువాత ఒకరు వచ్చి, ఆ మసాలా దట్టించిన వాక్యాలను బిగ్గరగా చదివి వినిపిస్తూ విరగబడి నవ్వి వెళుతున్నారు.

వారిలో కొందరు, రాసిన విషయాన్ని అటుంచి ఆ రచనాచాతుర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నామంటున్నారు. రోజు మొత్తం మీద సుమారు ఓ ఇరవై మంది వచ్చి, అటూ ఇటుగా అదే మాట చెప్పి వెళ్లారు.

మా ఇంటి ఎదురుగా చిన్న తోట ఉంది. ఓ సాయంకాలం ఆ తోటలో, గాయపడ్డ మనస్సుతో, అన్యమనస్కుడిలా అటూ ఇటూ తిరుగుతున్నాను. సాయంకాలం గూళ్లకు తిరిగి వస్తున్న పక్షులను చూస్తుంటే నాకొక విషయం అర్థమైంది. ఏ రకంగా చూసినా, ఆ పక్షుల్లో పత్రికా రచయితల్లా భేదభావాలు లేవు. సాహిత్యాభిరుచిని పెంపొందించుకోవాలన్న చర్చల్లేవు.


నేను ఒకే విషయాన్ని ఆలోచిస్తున్నాను. ఆ పత్రికా విమర్శకు దిమ్మతిరిగే సమాధానం ఎలా ఇవ్వడమా అని. మర్యాదకు గల పరిమితి ఏమిటంటే, ఆ రచనలోని ఆంతర్యం అన్ని స్థాయిల పాఠకులకు ఒకేలా చేరదు. అందుకే, నా ప్రతిస్పందనని ఆ పత్రిక శైలిలోనే తిప్పికొట్టాలని నిశ్చయించుకొన్నాను.

నేను ఒక నిర్ణయానికి వచ్చేటప్పటికి, ఆ సాయంకాలపు మసకచీకట్లలో ఓ పరిచయం ఉన్న గొంతు వినబడింది. ఆ వెంటనే, సున్నితమైన వెచ్చని స్పర్శ నా అరచేతిని తాకింది. నేంతగా నా ఆలోచనల్లో మునిగిపోయి ఉన్నానంటే, ఆ స్పర్శ, ఆ కంఠస్వరం నాకు పరిచయమైనవని కూడా గుర్తుకు రాలేదు.

అవి నాకు దూరం సాగిన మరుక్షణం, ఆ లేత గొంతు నా చెవుల్లో ప్రతిధ్వనించసాగింది. ఆ వెచ్చని స్పర్శ నా జ్ఞాపకాల్లో సజీవమయింది. నా పాపాయి మరోసారి నా దగ్గరికి వచ్చింది.

మెల్లిగా నా చెవిలో గుసగుసలాడుతున్నట్లుగా పిలిచింది, "నాన్నా!"

కానీ, నా నుంచి ఎలాంటి బదులు రాకపోయే సరికి, ఆమె నా కుడిచేతిని మెల్లిగా పైకి ఎత్తింది. తన నుదుటి మీద ఆనించింది. ఆ తరువాత, వెనక్కి తిరిగి ఇంట్లోకి వెళ్లిపోయింది. చాలా కాలంగా ప్రభ నన్నంత చనువుగా పిలవలేదు.



అంత లాలనగా బుజ్జగించలేదు. ఆ పిలుపుతో, ఈ వేళ ఆకస్మాత్తుగా ఆమె మీద వాత్సల్యం కలిగింది. ఆ చిన్నారి కోసం పరితపించసాగాను.

కొద్ది సేపటి తరువాత ఇంటికి తిరిగి వెళ్లాను.

ప్రభ మంచం మీద పడుకొని ఉంది. ఆమె కళ్ళు సగం మూతలుపడ్డాయి. ప్రభ చాలా నొప్పిలో ఉన్నట్టుగా ఉంది. దుమ్ములోకి రాలిపడిన సాయంకాలం పువ్వులా ఉంది.

ప్రభ నుదుటి మీద చేయి పెట్టి చూసాను. జ్వరంతో ప్రేలిపోతోంది. ఆమె ఊపిరి వేడిగా ఉంది. నాడి తీవ్రంగా కొట్టుకొంటోంది.

ఆ పసిబిడ్డ జ్వరం మొదలైనట్టు గ్రహించగానే, తండ్రి ఆదరణ కోసం వెతుక్కొంటూ పరిగెత్తుకు వచ్చింది. అయితే, అతనేమో ఒక విషపూరిత స్పందనను రాయడం ఎలాగా అన్న ఆలోచనలో మునిగిపోయి ఉన్నాడు!

ప్రభ పక్కనే కూర్చున్నాను. ఆ పసిబిడ్డ ఒక్క మాట కూడా మాట్లాడకుండా, నా చేయిని తన జ్వరంతో మండిపోతున్న అరచేతుల గుప్పిటలో పట్టుకొని, ఆమె నుదిటిన ఆనించుకొంది. మౌనంగా, కదలకుండా అలాగే ఉండిపోయింది.

ఇంట్లో కుప్పలుగా పడి ఉన్న జహిర్ గ్రాం, అహిర్ గ్రాం పత్రికలను బూడిద చేసాను.

నా మీద విరుచుకుపడిన విమర్శలకు ఎలాంటి బదులు ఇవ్వలేదు. ఆ విధంగా నా ఓటమిని అంగీకరించిన ఆ క్షణాన, నాలో కలిగిన సంతోషానికి మాటలు లేవు.

ప్రభ తల్లి చనిపోయినపుడు, ఆ పసిబిడ్డను నా చేతుల్లోకి తీసుకొన్నాను.

ఇప్పుడు, ప్రభ తల్లికి బద్దశత్రువైన నా రచనాచాపల్యాన్ని కాటికి పంపాక, నా పాపాయిని నా హృదయానికి పొదువుకొన్నాను. ★

అనుసృజకుల వ్యాఖ్యానం

సంపాదకుడు ఒక ఒంటరి తండ్రి. ముక్కుపచ్చలారని కూతురి యోగక్షేమాలు ఆమె వివాహంలో ఉంటాయని, అందుకు అవసరమైన కట్నకానుకల తయారీ తండ్రి మౌలిక బాధ్యత అనీ, గ్రహించి సంపాదనా మార్గం పడతాడు. అందుకు అతను ఎంపిక చేసుకొన్నది, పత్రికా సంపాదకత్వం.

సంపాదన సంగతి అటుంచి, అతను కీర్తి వ్యామోహంలో పడి, వృత్తి వ్యూహంలో చిక్కుకుపోతాడు. అతను గ్రహించ లేనంత సహజంగా, అతని పత్రిక నుంచి అతని ప్రవర్తన వరకు విషతుల్యమవుతూ రాసాగాయి.

ఆ క్రమంలో ఏ బిడ్డకోసమయితే ఈ పనిలో చేరాడో, ఆమె బాగోగులను పూర్తిగా విస్మరిస్తాడు. వృత్తి సవాళ్ళ వత్తిళ్ళలో మునిగి, ఆ చీకాకులన్నిటినీ ఆమె మీద గుమ్మరిస్తాడు.

ఏది ఏమైనా, ఆ చిట్టితల్లే అతని యోగక్షేమాలను చూస్తుంది. వచ్చీ రాని పనులతో తన చిట్టి చేతుల్లో పెట్టుకొని తండ్రిని పెంచుతోన్న ప్రభను చూసి, తండ్రే ఆశ్చర్యపోతాడు.

'తన బిడ్డకు ఒక కొత్త బొమ్మ దొరికింది. నాన్న బొమ్మ. ఎంత మురిపెంగా ఆడుకొంటోందో నాన్నా కూతుర్ల ఆట!' అని అనుకొంటాడు.

చివరికి, తమ సంబంధబాంధవ్యాన్ని నిలబెట్టుకొనేలా, ఆ సంపాదకుడు తనను తాను ఎలా సవరించుకొన్నాడో, ఏ గ్రహింపుతో ఏమి ఎడిట్ చేసుకొన్నాడో, అదీ ఈ కథ!

ఆనాటికైనా, ఈనాటికైనా, వృత్తికి వ్యక్తిత్వానికి, జీవితానికి సమాజానికి నడుమ ఉన్న నాజూకు సంబంధాన్ని అర్థం చేసుకోమని బలంగా చెబుతుంది టాగోర్ కలం!

పనిలోపనిగా, ఆనాటి పత్రికా వ్యవహారాలపై టాగోర్ చుర్రున వేసిన చురక ఈనాటికీ వర్తిస్తుంది కదా!

★

COMMENTS